## సింగిల్ పేజీ కథలు

# బహుమతి

ఎండాకాలం సెలవులు, అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ల పిల్లలమంతా సిటీకి అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరిలో కలుసుకున్నాం.

"అసలు భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేకపోవడమే ఈ సృష్టిలో ఉన్న సస్పెన్స్. దాన్ని అనుభవించగల ధైర్యం ఉండడమే లైఫ్‌లో గల థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్" అన్నాడు బాబాయ్ కొడుకు పవన్.

"ఎందుకూ? కొందరు మేధావులు చెప్పగలరు భవిష్యత్తును. పోతులూరి వీరబ్రహ్మం గారి 'కాలజ్ఞానం' అలాంటిదే!" అందుకుంది చెల్లెలు పవిత్ర.

"ఒక పథకం ప్రకారం సాయంత్రం సినిమా చూస్తాం. రాత్రి వంకాయ వండుతాం. వచ్చే సంవత్సరం పవిత్ర మెడిసిన్ అయిపోయి పెళ్ళి చేసుకుంటుంది..అలాంటిదే ఆ కాలజ్ఞానం" ఒకింత వెటకారంగా అన్నాడు పవన్ మాథ్స్ లెక్చరర్‌గా ఓ డిగ్రీ కాలేజ్‌లో మొన్నీమధ్యే చేరాడు.

"ఏమన్నయ్యా..మాట్లాడవ్ నిజమేనా?" పవిత్ర అడుగుతోంది నన్ను. తన వాదనే సరైనదని చెప్పాలంటూ బతిమాలుతున్నట్లు.

"సరేగానీ..వచ్చే ఏడాది ఎండాకాలం సెలవల్లో నీ పెళ్ళంటగా..నిజమేనా?" నవ్వుతూ అన్నాన్నేను.

"ఫో అన్నయ్యా! టాపిక్ డైవర్ట్ చెయ్యకు. అసలు విషయం చెప్పు" అంది పవిత్ర సీరియస్‌గా.

"నేను మొన్నే ఇంగ్లీష్ జర్నల్‌లో చదివా! భగవద్గీతలో చెప్పిందే ఆ వ్యాసం సారాంశం. ఒక స్ప్రింగ్‌నెలాగైతే బలంగా చుట్టినప్పుడు కొంత స్థితి శక్తిని సంతరించుకుని ఒక యాంత్రిక పనిచేయడానికి సిద్ధమవుతుందో అలాగే మన ఈ జన్మలోని నడవడీ, తీరుతెన్నుల వల్లే అలా కొంత పుణ్యాన్నో, పాపాన్నో మూటగట్టుకుని వచ్చే జన్మలో ఆయా జాతి జీవులుగా పుడతాం. పువ్వుగా పుట్టి మోక్షం చెందేవాళ్ళు ధన్యజీవులు. అలాకాక పశుపక్షి మృగాది జాతి జీవులుగా పుట్టి క్రిందటి జన్మ ఫలాన్ని అనుభవించాల్సిరావడమే వింత. అయితే మనం కచ్చితంగా భవిష్యత్తులో ఏం జరగబోతోందో చెప్పలేకపోవడమే..మనలో కుతూహలం పెరిగి అజ్ఞానంలో ఉన్నామన్న ఊహ కల్గటానికి కారణం. అదే పెద్ద సస్పెన్స్" అన్నాన్నేను.

ఈ చర్చనంతా వింటున్న అత్తయ్య "మన పవిత్ర గ్రంథాల్లో గల నిజాలను తమ పాఠ్యప్రణాళికల్లో పెట్టాలి. మరింత ఎక్కువ స్థాయిలో విద్యార్థులకు నీతి కథలు, భక్తి కథల ఆవశ్యకత ఉంది" అంది.

"ప్రొఫెషనల్ కోర్సెస్ ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే విద్యార్థులకు లాంగ్వేజెస్ ఉండవు. దానితో వీటి పరిచయం ఇంటర్‌తో ఆగిపోతుంది" అన్నాను అత్తయ్యతో.

ఇంతలో బ్రేక్‌ఫాస్ట్ రెడీ అంటూ చిన్న చెల్లి అందరికీ టిఫిన్ ప్లేట్ తీసుకొచ్చి అందించింది.

అంతటితో టాపిక్ ముగించి అంతా టిఫిన్ ఆరగించడానికి సిద్ధమయ్యాం.

"కారుణ్యా! కారుణ్యా!" ఆప్యాయంగా పిలుస్తోన్న గొంతు.

తాతయ్య...!

అటువైపుగా జామచెట్టు క్రింద ఈజీ ఛెయిర్‌లో కూర్చున్న తాతయ్యను మేమెవరమూ గమనించనే లేదు. నాన్నగారి నాన్నగా మేమూ, మా తరం ఆయనకిచ్చే గౌరవం అంతా ఇంతా కాదు.

"ఏంటి తాతయ్యా?" దగ్గరికి వెళ్ళి అడిగా.

"కారుణ్యా! నీకు తెలియనిది మరొక విషయం చెబుతున్నా విను. భవిష్యత్తు కాలాన్ని అందంగా వినియోగించుకోగల ప్రణాళిక వేయగలగడం ఒక యెత్తు. అది యెన్ని మలుపులు తిరుగుతూ ఎంత విజయం సాధించగలమో అన్నది మరొక యెత్తు" అన్నారు తాతయ్య.

ఇందాకటి పవిత్ర ముఖంలోని 'ప్రశ్న' గుర్తు ఇంతకూ ఫ్యూచర్ వ్యూహమా? అనూహ్యమా? అన్నది ఇప్పుడు ఏ కోశానా లేదు.

రోజూ 'గీత' చదువుతూ పూజ చేసే తాతయ్య భగవద్గీతలో గల అన్ని అంశాలను, తన గీతా పరిజ్ఞానాన్ని సందర్భాన్ని బట్టి ఇతరులకు చెబుతూ ఉంటాడు.

మనం ధరించిన దుస్తులు పాతబడి చిరిగే దశకు చేరుకోగానే వాటిని విదిలి కొత్తదుస్తులు ఎలాగైతే వేసుకుంటామో అలాగే ఆత్మభౌతిక దేహాన్ని వదిలి కొత్త దేహాన్ని ధరిస్తుందన్నది తాతయ్య పూర్తిగా బలంగా నమ్మే విషయం. కర్మ సిద్ధాంతాన్ని తాతయ్య విశ్వసించినంతగా మేమెవరమూ విశ్వసించం.

విశ్వసించమని కాదు. అసలా విషయం ఎప్పుడూ ఇంతలా మా మధ్య చర్చనీయాంశం కాలేదు.

ఈ బిజీ ప్రపంచంలో వేగాతివేగపు పరుగుల జనజీవనంలో ఎండాకాలపు సెలవులు సేదతీర్చినట్టుగా ఉన్నాయి. ఈ సెలవుల్లో తాతయ్య చుట్టూ వీలైనప్పుడల్లా చేరి ఎన్నో తెలియని విషయాల్ని నేర్చుకున్నాం అన్న భావన మా పిల్లలందరిలోనూ కల్గడం నేను గమనించాను. రేపటితో సెలవులు ముగుస్తాయి. ఈరోజే అంతా ప్రయాణమై ఎవరి స్థానాల్లోకి వాళ్ళం వెళ్ళిపోతున్నాం.

పవన్, పవిత్ర, నేను, చెల్లాయి ఒక నిర్ణయం తీసుకున్నాం. వెళ్ళగానే సెలవల్లో గడిపిన సమయాన్ని మర్చిపోకుండా తాతయ్యకు కృతజ్ఞతగా లెటర్ వ్రాయాలనీ, బహుమతిగా ఒక కొత్త తెలుగు భగవద్గీత పంపాలనీ..

ఇప్పుడు తాతయ్య చదివేది సంస్కృతంలో ఉన్న గీత.

మళ్ళీ సెలవల్లో తాతయ్య ప్రశ్న.

"మీరు కొనుక్కోమంటే నాకు పంపారేమిట్రా గీత?"

"కాదు తాతయ్యా! మేమంతా కొనుక్కోగా మీకు మరో కాపీ పంపాం" అంటూ మా సమాధానం.

అది విన్న తాతయ్య మాలో ఉన్న జిజ్ఞాసకి గలగలా నవ్వాడు. మేమూ జత కలిపాం.

-అనుప్రియ (హైదరాబాద్)

